క్లుప్తంగా

మోకాళ్లపై నిరసన

కడప అర్బన్ : కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నాలుగవరోజున కడప రిమ్స్ ఓపీ విభాగం ముందు గంటసేపు మోకాళ్లపై కూర్చుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. వెంకట సుబ్బయ్య, పీవి సుదర్శన్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎడ్యుకేషన్‌లో ఏమాత్రం తేడాల్లేవన్నారు. పని చేసే విధానాల్లో తేడాల్లేవు కానీ, వేతనాల్లో తేడాలున్నాయన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులకు వికలాంగుల పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎల్. భాస్కర్, బి. బాలాజీరావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్, ఉద్యోగ పోరాట సమితి కన్వీనర్ షేక్ సిద్దిఖీలు కోరారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం లేదని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు, కరోనా కాలంలో వైద్యశాఖలో కొన్ని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో కల్పించారన్నారు. ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ, గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–4తో పాటు ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన పోలీసు కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ఐ నగర సమన్వయకర్త ఎస్‌కే మైనుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి దేవ రాహుల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.చైతన్య, జిల్లా కార్యదర్శి వలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయిపేటకు చెందిన నాగూరు పీరమ్మకు అదే ప్రాంతానికి చెందిన సాయిబాలజీ అనే వ్యక్తి డబ్బుల విషయంలో నమ్మకద్రోహం చేశాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన డబ్బు రూ. 2 లక్షలను భద్రంగా వుంచుతానని నమ్మబలికించి సాయిబాలీజీ ద్రోహం చేశాడని పీరమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ జయరాముడు తెలియజేశారు.

ట్రాక్టర్ ప్రమాదంలో కూలీలకు గాయాలు

ముద్దనూరు : మండలంలోని కాండ్లోపల్లె సమీపంలో గురువారం వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. బాధితుల సమాచారం మేరకు.. వేల్పుచెర్ల గ్రామానికి చెందిన సుమారు 12 మంది మహిళా కూలీలు పనుల నిమిత్తం కాండ్లోపల్లెకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. అకస్మాత్తుగా ట్రాక్టర్ లిఫ్ట్ లేవడంతో ట్రాలీలో వున్న కూలీలు కిందపడ్డారు. ఇరువురు మహిళలకు స్వల్పగాయాలుకాగా ఒకరికి కాలు, మరొకరికి చేయి విరిగినట్లు సమాచారం. డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని కూలీలు తెలిపారు.

రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చెన్నూరు : రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర హార్టికల్చర్ సలహా మండలి ఉద్యానవన సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం చెన్నూరులోని రైతు భరోసా కేంద్రం–2 ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం వ్యవసాయ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ మండలానికి పంటల బీమా పరిహారం కింద ఖరీఫ్ 2022 సంవత్సరానికి గాను 995 మంది రైతులకు ఒక కోటి 48 లక్షల రూపాయలు అందించారన్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు : తెలంగాణ ప్రభుత్వం తరహాలో మన ప్రభుత్వం కూడా ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగు సాయం చేసి ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు గురువారం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉండటంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాశినాయన : మండలంలోని వరికుంట్ల నుంచి జ్యోతిక్షేత్రానికి వెళ్లే దారిలో ఎస్సీ కాలనీ సమీపంలో గుర్తు తెలియని 65 ఏళ్ల వ్యక్తి గురువారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాశినాయన ఎస్‌ఐ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా గుర్తిస్తే తమకు తెలియజేయాలని కోరారు.

‘జగనన్న సురక్ష’ అద్భుత కార్యక్రమం

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ‘జగనన్న సురక్ష’ అద్భుత కార్యక్రమమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక 31, 44, 6 డివిజన్లలో నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ శిబిరాల్లో ఆయన మేయర్ సురేష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించి, శిబిరానికి హాజరైన ప్రజలను పలకరించి ప్రభుత్వ సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటా ప్రభుత్వ పథకాలు అందలేదన్న మాట రాకూడదన్నారు. ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సేవలు, పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజులుగా జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని సచివాలయాల వారీగా జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. ఇందుకోసం తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన పథకాలు 99 శాతానికి పైగా లబ్ధిదారులకు చేరువయ్యాయన్నారు. వివిధ కారణాల వల్ల పథకాలు అందకుండా మిగిలిపోయిన వారికి కూడా వాటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపడుతున్నట్లు తెలిపారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల వద్దకే పరిపాలనను తీసుకెళ్లి ప్రభుత్వ పథకాలు, సేవలను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఈనెల 30వ తేది వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని, ఏవైనా సందేహాలుంటే 1902 నంబర్‌కు కాల్ చేసి ‘జగనన్నకు చెబుదాం’ ద్వారా తమ విజ్ఞప్తులను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్ యానాదయ్య, తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్పొరేటర్లు అజ్మతుల్లా, షఫీ, 44వ డివిజన్ ఇన్‌చార్జి రామక్రిష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ మియ్యా, వైఎస్సార్‌సీపీ నాయకులు తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, విజయ్‌స్వామి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సంకల్పానికి తోడ్పాటునిద్దాం

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపు
- రూ.65 కోట్లతో క్రిష్ణా సర్కిల్– దేవుని కడప రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : గత ప్రభుత్వాలు చూపిన వివక్ష, నిర్లక్ష్యం వల్ల వెనుకబడిన కడపను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి నగరవాసులు తోడ్పాటునివ్వాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కడప వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో క్రిష్ణా సర్కిల్– దేవుని కడప విస్తరణ తర్వాత జరిగే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అన్ని ప్రభుత్వాలు ఈ జిల్లాను నిర్లక్ష్యం చేశాయని, ఒక్క వైఎస్సార్ మాత్రమే జిల్లా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఆయన మరణం తర్వాత జిల్లా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం నగరాభివృద్ధికి చిల్లిగవ్వ కూడా విదల్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కడపలో ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను గుర్తించి 7 రహదారులను విస్తరించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఇందులో మహావీర్ సర్కిల్ – రిమ్స్, ఎర్రముక్కపల్లె– రైల్వేస్టేషన్ రహదారులు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్, అన్నమయ్య సర్కిల్– గోకుల్ లాడ్జి, క్రిష్ణా సర్కిల్– దేవుని కడప మార్గాలలో విస్తరణ పనులు పూర్తి చేసి, రోడ్లు, కాలువలు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, సర్కిళ్లు ఏర్పాటు చేసేందుకు చురుగ్గా పనులు సాగుతున్నాయన్నారు. అందులో భాగంగా క్రిష్ణా సర్కిల్– దేవుని కడప రోడ్డులో రూ.65 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సెంట్రల్ మీడియన్లు, సర్కిళ్లు ఆధునీకరిస్తున్నామన్నారు. ఈ రోడ్డులో క్రిష్ణా సర్కిల్, మాచుపల్లి బస్టాండు, మాసాపేట, మార్కెట్ యార్డు వద్ద సర్కిళ్లు రానున్నాయన్నారు. నగర వాసులు నగరాభివృద్ధి కోసం రోడ్ల విస్తరణకు సహకరించాలని కోరారు. తద్వారా నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, కో ఆప్షన్ సభ్యులు జమీర్, బండి మరియ, పత్తిరాజేశ్వరి, కార్పొరేటర్లు రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, షఫీ, పార్టీ నాయకులు త్యాగరాజు, ఐస్‌క్రీం రవి, రఫీ, బి. క్రిష్ణారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, జి. గరుడాద్రి, మియ్యా, సీహెచ్ వినోద్, అమరేష్ బాబు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అంటువ్యాధులు దూరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : జంతువులపై అభిమానం చూపుతూ వాటి నుంచి వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన పెంచే లక్ష్యంతో ప్రపంచ జూనోసెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. జంతువుల ద్వారా మానవులకు వచ్చే వ్యాధులకు నివారణ చర్యలు, చికిత్స విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బ్యాక్టీరియల్, వైరస్ ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. సంక్రమిత వ్యాధులనే జూనోసిస్ డిసీజెస్ అంటారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ జంతువుల ద్వారా వచ్చే వ్యాధుల చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయాలని వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎ.టి.వి. రెడ్డి, డా. అనుప్రసన్న, డా. మరియదాస్, ఆచార్య ఎల్.వి. రెడ్డి, డా. టి. చంద్రశేఖర్, పరిశోధకులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో గురువారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. వీసీ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానమంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, అధ్యాపకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు అని కార్పోరేటర్ అలీ అక్బర్, చాక్లెట్ గౌస్ అన్నారు. కడప 33వ డివిజన్ పరిధిలోని బెల్లంమండి వీధిలోని నగరపాలక ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు బాబు జగ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీముల్లా, ఉపాధ్యాయులు సయ్యద్ సోఫియా పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ వర్ధంతి

కడప కార్పొరేషన్: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు బ్రెడ్ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు చైతన్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ అందించిన సేవల గూర్చి కొనియాడారు. కార్మిక, రక్షణ శాఖామంత్రిగా ఆయన గొప్ప సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, శ్యాంసన్, మహిళా నేతలు తులశమ్మ, పద్మ, శివమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ విడుదల చేయాలని ఏపీఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీఎఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ విడుదల చేసే అధికారం ప్రభుత్వానిదేనని తెలిపారు. పాఠశాలలలో పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతుందన్నారు. మున్సిపల్ సర్వీసు రూల్స్ ద్వారా మున్సిపల్ పాఠశాలల అప్ గ్రేడేషన్, ప్లస్ 2 పాఠశాలల ఆవిర్భావం, కొత్త పోస్టుల మంజూరు జరుగుతుందన్నారు.

ప్రతి ట్రిప్పుకు ఒక టన్ను చెత్త సేకరించాలి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రతి క్లాప్ వాహనం ఒక ట్రిప్పునకు ఒక టన్ను చెత్త సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు, పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా స్వీకరించాలన్నారు. ఇంకా ఎవరికైనా చెత్త బుట్టలు ఇవ్వకపోతే వారికి ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ జరక్కపోవడం వల్ల చెత్తను రోడ్డుపై, కాలువల్లో వేస్తున్నారన్నారు. ఫలితంగా కాలువల్లో ఆ చెత్తంతా బ్లాక్ అయి ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పుట్లంపల్లి గార్బేజ్ స్టేషన్ వద్ద మైక్రో కంపోస్టు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా ఎరువు తయారు చేయవచ్చన్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు పొడిచెత్త వేరు చేయు పాయింట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్మికుల వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యల గూర్చి కార్మికులు అడుగగా, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, లక్ష్మినారాయణ, టీవీ రమణ, సునీల్, గంగాధర్ పాల్గొన్నారు.

వేడుకగా కడపరాయుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావించే కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపైగల ప్రత్యేక పీఠాలపై కొలువుదీర్చారు. అనంతరం ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, కృష్ణమోహన్, త్రివిక్రమ్‌ల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం లాజహోమం నిర్వహించారు. ఉభయదారులతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. సాయంత్రం కల్యాణమూర్తులను ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. అర్చకులు మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదానం..

కల్యాణం అనంతరం భక్తులు అన్నదానం నిర్వహించారు. ఇటీవల కడప రాయుని సన్నిధిలో అన్నదానం చేసేందుకు దాతలైన భక్తులను ఆలయ నిర్వాహకులు, టీటీడీ అధికారులు అనుమతించారు. దీంతో ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నారు. మరికొందరు భక్తులు శనివారంతోపాటు ఆలయంలో జరిగే ఇతర పూజోత్సవాల సందర్భంగా అన్నదానం చేసేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవ సందర్భంగా కల్యాణ మండపంలో స్థానిక భక్తుడు డి.వెంకట సుబ్బారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

సబ్సిడీ రుణాలతో స్వయం సమృద్ధి



మాట్లాడుతున్న కె.బంగారు బాబు

కడప అర్బన్ : సబ్సిడీ రుణాలతో స్వయం సమృద్ధి సాధించవచ్చని ఆర్టిసన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కె.బంగారు బాబు తెలిపారు. నగరంలో గురువారం హస్త కళాకారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హస్తకళాకారులందరూ ఆర్టిసన్ కార్డు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ముద్ర, పీఎంఈజీపీ తదితర రుణాలను సులభంగా పొందవచ్చని చెప్పారు. తమ వృత్తి రంగంలో అవసరమైన పనిముట్లు, యంత్రాల కోసం వీటిని వినియోగించుకోవాలన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. గ్రూపుగా ఏర్పడితే క్లస్టర్ రుణాలు పొందవచ్చని, ఇందులో 90 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టిసన్ కార్డులు ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్టిసన్ సెల్ జిల్లా కన్వీనర్ వీరబ్రహ్మాయ్య ఆచారి, కో కన్వీనర్ వెంకటేష్, పేర్వాపాటి బద్రీ, శేషగిరి, అఖిల భారత విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వరాచారి, మహిళా నాయకురాళ్లు నారాయణమ్మ, అనురాధ, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన హస్త కళాకారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా తులసీమాలలతో అలంకరించారు. అలాగే లలితాదేవికి, శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు, విష్ణుసహస్రనామ పారాయణం చేసి భక్తి గీతాలను ఆలపించారు. పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చాపాడు: సీబీఐటీ కాలేజీ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చియ్య పాడుకు చెందిన బోగిరెడ్డి బాలకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు నుంచి చియ్యపాడుకు స్కార్పియో వాహనంలో వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. గాయపడిన బాలకృష్ణారెడ్డిని చియ్యపాడు మాజీ ఎంపీటీసీ మహేష్ యాదవ్ సహకారంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకాటి విజయశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడుగా బొల్లవరానికి చెందిన పందిటి శ్రీనివాసులును గురువారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన జాకాటి విజయశేఖర్‌తోపాటు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్‌మెంట్ అధికారులు

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని ఎరువులు దుకాణాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అమ్మితే కఠినచర్యలు ఉంటాయని విజిలెన్స్ సీఐ ఈదురుబాషా, ఇన్‌స్పెక్టర్లు బాలగంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు అన్నారు. గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి షేక్ మాసూమ్‌బాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్సుమెంట్ విభాగపు అధికారులు కడప వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి కడపలోని పలు ఎరువుల దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప ఎస్ఎఫ్ఎస్ స్ట్రీట్‌లో నిభూమి పెస్టిసైట్స్ అండ్ సీడ్స్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా విక్రయిస్తున్న చిక్కుడు విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.14,400 విలువ ఉంటుందని తెలిపారు. అలాగే తిరుమల ఆగ్రో సీడ్స్‌లో విత్తనాలను స్టాక్ రిజిస్టర్‌లో అప్‌డేట్ చేయనందుకు 2,63,200 విలువ చేసే విత్తనాల సేల్స్‌ను నిలిపివేశారు. అలాగే శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఏజెన్సీస్‌లో 1,26,540 విలువ చేసే విత్తనాల అమ్మకాలను ఆపేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణదారులు ఎవరైనా నకిలీ విత్తనాలుగానీ, ఎరువులుగానీ, పురుగుముందులుగానీ అమ్ముతున్నట్లు మాదృష్టికి తీసుకవస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందిన ‘మన్రో’



మన్రో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సామ్యూల్‌బాబు

కడప రూరల్ : జిల్లా తొలి కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో ప్రజల మన్ననలు పొందారని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ బిషప్ కే సామ్యూల్ బాబు అన్నారు. మన్రో వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1800 నుంచి 1807 వరకు మన్రో జిల్లా తొలి కలెక్టర్‌గా పనిచేసి కరువు సీమ రాయలసీమ ప్రాంతానికి ఎనలేని సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. అధికారులు ఆయన పాలనను, జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజా సంక్షేమ పాలనను సాగించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ స్వర్ణన్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కమలాపురం : రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని చిన్నచెప్పలి హెల్త్ సబ్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. సబ్ సెంటర్‌లో ఉన్న సంజీవిని కాల్ సెంటర్‌ను సందర్శించి రోగులతో మాట్లాడారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి, ప్రొద్దుటూరులోని స్పెషలిస్ట్ డాక్టర్లకు రెఫర్ చేసి చికిత్సలు అందేటట్లు చూడాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఎన్‌సీడీ సర్వే 100 శాతం చేయాలన్నారు. అనంతరం చిన్నచెప్పలి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ గర్భవతులు, బాలింతలకు అందుతున్న పోషకాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్ పంపిణీని పరిశీలించారు. అంగన్వాడీ వర్కర్, ఏఎన్‌ఎంలు కలసి పోషకాహార దినోత్సవాన్ని జరపాలని సూచించారు.

పెంపుడు జంతువుల్లో వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలి



వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : పశువుల నుంచి రేబిస్, అంత్రాక్స్, ఎబోలా వంటి వ్యాధులలు సంక్రమిస్తాయని, వాటి నివారణకు టీకాలు, డీవార్మింగ్ రెగ్యులర్‌గా వేయించుకోవాలని జిల్లా పశుసంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం కడప వెటర్నరీ పాలీక్లీనిక్‌లో జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ అధ్యక్షతన పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల ద్వారా సక్రమించే వ్యాధుల గురించి అవగాహన కోసం ప్రతి సంవత్సరం జులై 6వ తేదీన జూనోసిస్ దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. పెంపుడు జంతువులకు కచ్చితంగా టీకాలు వేయించుకోవాలన్నారు. జంతువుల పెంపకందారులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 131 యాంటీ రేబిస్ టీకాలు, 75 పశువులకు చికిత్సలు చేశారని తెలిపారు. పశు వ్యాధులు సోకకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీపీసీ ఏడీలు డాక్టర్ నేతాజీ ఓబురాయి, డాక్టర్ సుబ్బరాయుడు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏడీడీఎల్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్లు రాంబాబు, సంధ్య, జేవీఓ రాజశేఖర్, ఎస్ఎస్‌ఏ షాహిదబేగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.